క్లుప్తంగా

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

తాడేపల్లి రూరల్: విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో సరిత చెప్పారు. మిషన్ శక్తి సంకల్పంలో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి జరుగుతున్న 'అవగాహన'పై తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సరిత మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. పోక్సోయాక్ట్‌లపై, న్యూట్రిషిన్‌పై విద్యార్థినులకు అర్థమయ్యేరీతిలో వివరించారు. బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలను తెలిపారు. మిషన్ శక్తి, మిషన్ వాత్సల్యకు వివరాలతో పాటు టోల్‌ఫ్రీ నంబర్లను విద్యార్థినులకు తెలియజేశారు. సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోజప్ప, మహిళా సంరక్షణ అధికారి కిర్మణయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ పెదకాకాని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలిని ఆ గ్రామ నివాసి కులం పేరుతో దూషించడం, ఆమెపై దాడిచేయడం దుర్మార్గమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై, అణగారిన వర్గాలపై దాడులు జరగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. కార్మికులపై అకారణంగా దాడి చేసినా, దూషించినా సీఐటీయూ సహించదని, న్యాయ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల కుంచనపల్లి గ్రామ అధ్యక్ష కార్యదర్శులు కొక్కిలిగడ్డ ఝాన్సీరాణి, టి. కృష్ణ తులసి, పారిశుద్ధ్య కార్మికులు జోజి బాబు, కోటేశ్వరి, ప్రసాద్, ఇస్సాక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ




తాడేపల్లి రూరల్: తాడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏక్‌పేడ్ మాకే నామ్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేసిన మొక్కలను జాగ్రత్తగా పెంచి వాటి వివరాలను ఎప్పటికప్పుడు గ్రీన్ పాస్‌పోర్ట్‌లో నమోదు చేయాలని సూచించారు. వాతావరణం కాలుష్యరహితంగా మారి సమాజం ఆరోగ్యంగా జీవించడానికి దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత



దుగ్గిరాల: పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.10 వేలు విలువైప వంట సామగ్రి అందించారని అవి విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడతామని హెచ్.ఎం. బీవీ కృష్ణారావు తెలిపారు. గురువారం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన 2022–2023 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు రూ.10 వేలు విలువైన వంట సామగ్రిని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పాత్రలు అందించారని కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: దేశానికి స్వామి వివేకానంద చేసిన సేవలు ఎనలేనివని ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస కార్తీక్ అన్నారు. వేమవరం ఎంపీపీ పాఠశాలలో స్వామి వివేకానంద చికాగోలో ప్రసంగించిన రోజును పురస్కరించుకొని పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చికాగోలో భారతదేశం గొప్పతనాన్ని తెలియజేసిన మహనీయుడని చెప్పారు. వివేకానందుడిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు వివేకానంద గురించిన విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దివి కమల్‌మోహన్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జోలె పట్టి.. నిరసన తెలిపి..

- నేడు రాజధాని పారిశుద్ధ్య కార్మికులు చలో తుళ్లూరు
- జీతాల కోసం తుళ్లూరులో జోలె పట్టిన వైనం
- నాలుగో రోజుకు చేరిన నిరసనలు



తుళ్లూరు గాంధీ బొమ్మ సెంటర్లో జీతాలు రాక జోలి పట్టి నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

తాడికొండ: పారిశుద్ధ్య కార్మికులు తుళ్లూరులో జోలె పట్టి నిరసన తెలిపారు. అమరావతిలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మూడోనెల గడుస్తున్నా ఇప్పటివరకు జీతాలు చెల్లించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో 'నేడు చలో తుళ్లూరు' పేరిట సీఆర్డీయేలో జరగనున్న సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అర్జీ అందజేయనున్నట్లు గురువారం రాజధాని ప్రాంతం పారిశుద్ధ్య సంఘం గౌరవ అధ్యక్షుడు రవి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాజధాని పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలను పట్టించుకుని వారి పెండింగ్ జీతాలను వెంటనే కార్మికుల అకౌంట్లో జమ చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుళ్లూరులో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అమరావతి స్మార్ట్ సిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కేవలం రూ.12 వేల జీతంతో సరిపెడుతున్నారని, రాష్ట్రంలో మిగతా పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్నట్లు రూ. 21 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అరకొర జీతాలే..

ఏళ్ల తరబడి జీతం పెంచకపోవడం, ఇస్తున్న అరకొర జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని చెప్పారు. ఇప్పటికే అమరావతి స్మార్ట్ సిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సగం మందికి పైగా విధులు మానేశారన్నారు. ఒక్క తుళ్లూరులోనే గతంలో 48 మంది పారిశుద్ధ్య కార్మికులు గతంలో విధులు నిర్వహించగా, ప్రస్తుతం కేవలం 17 మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. రాజధానిలో ప్రస్తుతం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా జీతం పెంచకపోతే మానేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వీరు కూడా మానేస్తే రాజధానిలో పారిశుద్ధ్య పడకేస్తుందన్నారు.

ఆ పరిస్థితులు రాకముందే చర్యలు తీసుకోండి

ఆ పరిస్థితులు రాకముందే రాజధాని పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులను ఎప్పుడు అడిగినా పారిశుద్ధ్య కార్మికుల జీతం పెంచేశామని చెబుతున్నారన్నారు. ఆచరణలో పెంచిన జీతం ఇవ్వడం లేదని, గతంలో ఇచ్చిన రూ.12,000 మాత్రమే ఇస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. రాజధాని పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం 'చలో తుళ్లూరు' సీఆర్డీఏ కార్యాలయం వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

యర్రబాలెం ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులు



విద్యుత్ బిల్లులను చూపుతున్న అసోసియేషన్ నాయకులు

యర్రబాలెం(మంగళగిరి): పారిశ్రామిక వేత్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని యర్రబాలెం ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించడానికి రెండు రోజులు సమయం కావాలని కోరినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు చిన్న పరిశ్రమల విద్యుత్ కనెక్షన్‌లు కట్ చేయడం దారుణమన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అధికారులు ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్లాస్టిక్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది అధికారుల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అలాంటి అధికారులపై చర్యలు తీసుకుని చిన్న పరిశ్రమలను కాపాడాలని కోరారు. సంఘ నాయకుడు రావెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లులు చెల్లించడానికి 45 రోజులకు పైగా సమయం తీసుకుంటుందని విద్యుత్ బిల్లులు చెల్లించడానికి పరిశ్రమలను అదే సమయం ఇవ్వాలన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కనెక్షన్‌లు ఎలా కట్ చేస్తారని ప్రశ్నించారు. లక్షల రూపాయలు కాషన్ డిపాజిట్ రూపంలో ఉన్నప్పటికీ కంపెనీలకు కరెంట్ కట్ చేయడం దారుణమన్నారు. సంఘ నాయకులు సీతారామశర్మ, కృష్ణారెడ్డి, మునిరెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయూ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇవ్వడం సరికాదని, వెంటనే ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతన చట్టం ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సరైన వేతనం లేకపోతే కార్మిక కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సీఐటీయే తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో పాటు, రిటైర్డ్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెలన్స్‌లు వెంటనే కార్మికులకు జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.రాంబాబు, కార్యదర్శిగా మిక్కాయల్, ఉపాధ్యక్షులుగా నూతక్కి సామ్రాజ్యం, సహాయ కార్యదర్శిగా శివాజీ, కోశాధికారిగా ప్రాతూరు అశోక్‌ను కమిటీ ఎన్నుకుంది.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్‌బాబు



శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న కెఎల్‌యూ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ తదితరులు

తాడేపల్లి రూరల్: మానవ జీవితం విలువైనదని, సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని రీనోన్డ్ మోటివేషనల్ స్పీకర్, బిజినెస్ కోచ్ కె. శ్రీధర్ బాబు అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆత్మహత్యలు సమాజానికి ముప్పుగా మారుతున్నాయని, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడిలో ఉన్న వారిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాష్ట్ర కో కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో జీవితాన్ని వదిలివేయకుండా సాయం కోరడం అవసరమన్నారు. యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు, డాక్టర్ ఎస్. వెంకటరామన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూతురమ్య, వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ సైకాలజిస్ట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



మోతడక (తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డ్రోన్ టెక్నాలజీపై నిర్వహించనున్న 2 రోజుల వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వ్యవసాయ, నిర్మాణ, మిలిటరీ వివిధ రంగాల్లో డ్రోన్స్ వినియోగ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. మానవ రహిత వైమానిక విమానం సాంకేతికతను తెలుసుకొని దాన్ని నేర్చుకుంటే విద్యార్థులు డ్రోన్స్‌ను తయారు చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం వ్యవసాయ, రక్షణ, నిఘా, విపత్తు నిర్వహణలో డ్రోన్ డిజైన్, అసెంబ్లీ నియంత్రణ వ్యవస్థలు పలు అంశాలపై వివరించారు. వర్క్‌షాప్‌లో కళాశాల ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ బాలమురళీకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ నాగ రవికిరణ్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం విద్యార్థుల ల్యాప్‌ట్యాప్‌లు మాయం

నీరుకొండ(మంగళగిరి): మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ విద్యార్థుల ల్యాప్‌ట్యాప్‌లు మాయమైన ఘటన చోటు చేసుకుంది. గురువారం మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు యూనివర్సిటీలో మూడో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సాయిగణేష్, భావజ్ కుమార్ నీరుకొండ గ్రామంలో రూమ్‌లో ఉంటూ యూనివర్సిటీకి వెళ్తున్నారు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి యూనివర్సిటీకి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూసేసరికి రూమ్‌లోని రూ.2 లక్షల విలువైన 2 ల్యాప్‌ట్యాప్‌లతో పాటు పర్సు, ఏటీఎం, ఆధార్ కార్డు, ఆర్‌సీ కార్డులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివంగత కళాకారులను స్మరించుకోవటం కర్తవ్యం

తెనాలి: కమ్యూనిస్టు పార్టీకి ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చిన కళాకారులను స్మరించుకోవటం మన కర్తవ్యమని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అన్నారు. ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ కార్యక్రమం నాలుగోరోజైన గురువారం కొనసాగాయి. సాయంత్రం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో జరిగిన సభలో సూరపనేని లక్ష్మీ పెరుమాళ్లను స్మరించుకున్నారు. ఆమె నటించిన నాటకాలు, పోషించిన పాత్రలు, కళావైదుష్యాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో గుర్తుచేసుకున్నారు. వీరితోపాటు వెంపటి రాధాకృష్ణ, పరుచూరి హనుమంతరావు, రామకోటి, కర్నాటి లక్ష్మీనరసయ్య, అల్లు రామలింగయ్య, గుమ్మడి కుటుంబరావు, డీపీఎస్ఆర్ సుబ్బారావు, కోగంటి గోపాలకృష్ణయ్య తదితర వందమందికి పైగా కళాకారులు ప్రజాచైతన్యం కోసం కృషిచేశారని చెప్పారు. సీపీఐ తెనాలి నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి అమర కళాకారులకు జోహార్లు చెప్పారు. కళాకారులు, గాయకులు పాల్గొన్నారు.

నీటిని నిల్వ చేయాలి



వర్షం నీటి నిల్వపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెంలో వర్షం నీటిని ఎలా నిల్వ చేయాలి అనే విషయంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థి విభాగ అధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఒకప్పుడు బావులు అధికంగా ఉండేవని, క్రమేపీ బోర్లు పెరగడంతో తగ్గాయన్నారు. వర్షపాతం ఎక్కువగా ఉన్న సమయంలో నీటిని నిల్వ చేస్తే కొన్ని మిలియన్ల నీటిని ఆదా చేసుకోవచ్చన్నారు. చాలామంది నీటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేస్తారని కానీ అలాంటి డ్రమ్ములు ఒక దానిని తీసుకుని దాని చుట్టూ పైభాగం, కిందభాగం రంధ్రాలు చేయాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మూడు లేదా ఐదు అడుగుల గొయ్యి తీయాలని సూచించారు. అందులో ఈ డ్రమ్మును ఉంచి, దానిలో రాళ్లు, చిన్నచిన్న ఇటుక ముక్కలు ఉంచి డ్రమ్ము పైభాగం రంధ్రం చేసి అందులో పీవీసీ పైపును ఉంచి ఇంటి పైనుంచి వాన నీరు పైపులోకి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. గుంతలో ఉన్న డ్రమ్ము చుట్టూ పైభాగం వరకు కంకర లేదా ఇతర రాళ్లతో నింపి వర్షం పడిన ప్రతిసారి పైపు నుంచి నీరు డ్రమ్ములోకి వెళ్లేలా చూడాలని దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమాన్ని సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం. సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. విద్యార్థులను వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థుల విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

సెమీకండక్టర్ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి

తాడికొండ: దేశంలో సెమీకండక్టర్ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి చెప్పారు. నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం (ఎన్ఎస్‌టీఎస్) 2025 ప్రారంభోత్సవం అమరావతిలోని వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. 11 నుంచి 13 తేదీ వరకు జరగనున్న ఈ మూడు రోజుల సింపోజియంకు వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం, ఎన్ఫ్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్), వీవీడీఎన్ టెక్నాలజీస్, ఐఈఈఈ వీఐటీ– ఏపీ స్టూడెంట్ బ్రాంచ్ మరియు మైక్రోవేవ్ థియరీ అండ్ టెక్నిక్స్ సొసైటీ (ఎంటీటీ–ఎస్) మద్దతు ఇస్తున్నాయి. మధుమూర్తి మాట్లాడుతూ ఎన్ఎస్ టీఎస్– 2025 విద్యా, పరిశ్రమ ప్రభుత్వం నుంచి ఆలోచనలు కలిగిన నాయకులను సమావేశపరిచి సెమీకండక్టర్ రంగంలో పరివర్తన అవకాశాలను మెరుగు పరచటమే ఈ సింపోసియం లక్ష్యమన్నారు. భారత–కేంద్రీకృత ఆవిష్కరణలతో సెమీకండక్టర్ సరిహద్దులను ఉపయోగించడం' థీమ్ కింద అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను అన్వేషించడానికి వేదికగా పనిచేస్తుందన్నారు. సీఐఐ ఏపీ వైస్ చైర్మన్, అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కె. శరణం, ఇంద్రజిత్ అన్నే ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్ఫ్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డి.రామకృష్ణ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటా రెడ్డి ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, శరవణన్ జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ తదితరులు

మంగళగిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, తక్షణమే చేనేతకు రూ. వెయ్యికోట్ల రూపాయలు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళగిరి నగరపరిధిలోని పాతమంగళగిరిలో మహాసభలకు సంబంధించిన కరప్రతాలను గురువారం ఆవిష్కరించారు. బాలకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 6,7 తేదీల్లో పల్నాడు జిల్లా, సత్తెనపల్లిలో జరుగనున్న చేనేత కార్మిక సంఘ రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్ సబ్సిడీ, పావల వడ్డీ రిబేటు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షలు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి దుర్గా ప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో డబ్ల్యూబీ, ఏడీబీ బృందం పర్యటన



అమరావతిలో ప్రపంచ బ్యాంకు - ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

తాడికొండ: అమరావతి నగర అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టు కింద అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను పరిశీలించేందుకు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (డబ్ల్యూబీ, ఏడీబీ) బృందం 2 రోజుల పాటు రాజధానిలో పర్యటిస్తోంది. తొలి రోజు బృందంలోని సభ్యులు మొదటగా గెజిటెడ్ అధికారుల టైప్ 1, 2 నివాస సముదాయాలు, నాన్ గెజిటెడ్ అధికారుల నివాస సముదాయాలు, 6 ట్రంక్ రోడ్, ఎల్పీఎస్ జోన్ 2ఎ, 1ఎ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. మౌలిక వసతులను బృందం పరిశీలించి సీఆర్‌డీఏ అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేసింది. తర్వాత అనంతవరంలో ట్రీ ట్రాన్స్ ప్లాంటేషన్ నర్సరీ, తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణం ఎన్–9 ట్రంక్ రోడ్ పనులు, శాఖమూరు, నీరుకొండ రిజర్వాయర్‌ల వద్ద పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలను బృందం పరిశీలించింది. సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణం వద్ద పలువురు స్థానికులు, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో బృందంలోని సభ్యులు మాట్లాడారు. బృందంలోని ప్రతినిధులు ఆయా సైట్‌లలో నిర్మాణ పనుల పురోగతి, పర్యావరణ, సామాజిక రక్షణ ప్రమాణాలు అమలులో ఉన్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

13న తెనాలిలో నృత్యపోటీలు

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, శ్రీ లక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన మహిళలు, నృత్యం నేర్చుకున్న వారికి మాత్రమే నృత్య పోటీలను నిర్వహించనున్నారు. సంబంధిత కార్యక్రమ కరపత్రాన్ని రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత గురువారం ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. కొత్తపేటలోని శ్రీ రాధాకృష్ణ కల్యాణమండపంలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నృత్య పోటీలు జరుగుతాయని చెప్పారు. ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్ విభా గాల్లో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు మాత్రమే అర్హులని, ఒక్కో బృందంలో 6–8 మంది సభ్యులు పాల్గొనవచ్చునని ప్రదర్శన సమయం ఎనిమిది నిముషాలని తెలిపారు. క్లాసికల్ సోలో డ్యాన్స్ పోటీల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినులు మాత్రమే పాల్గొనాలనీ, ఒక్కొక్కరికి ఎనిమిది నిముషాల సమయం ఇస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు 90143 69149 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జి.అనూరాధ, కోట భవాని, భవ్యజ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్‌వాటర్ డ్రమ్ము బహూకరణ

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు నేరేళ్ళ దిలీప్ పుట్టిన రోజును పురస్కరించుకుని తులసీరామ్ చౌక్‌లోని స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు గురువారం స్టీల్ వాటర్ డ్రమ్మును ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను దాతలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం.లీలాకృష్ణ, ఉపాధ్యాయులు వెంకటగోపాలరావు, మౌనిక, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మంగళగిరి టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని గురువారం మంగళగిరి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్ 4వ లైను ఓ మినీ వ్యాన్ పార్కింగ్ చేసి ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసి పీడీఎస్ బియ్యం ఉన్న వాహనాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్.ఐ హరి బాబు తెలిపారు. వాహనంలో తాడేపల్లి నుంచి 60 బ్యాగుల పీడీఎస్ బియ్యం ఉన్నాయి. ఆటోనగర్ లో ఉన్న గోడౌన్‌లో తనిఖీ చేయగా అందులో మరో 70 బ్యాగ్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో బ్యాగులో 40 కేజీల పీడీఎస్ రైస్ ఉందని, మొత్తం 130 బ్యాగులు గుర్తించినట్లు, సుమారు 5000 కేజీల ఉండవచ్చునని పేర్కొన్నారు. డ్రైవరు తోపాటు వాహనాన్ని స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేసి నట్లు ఎస్.ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

మంగళగిరి టౌన్: మంగళగిరిలో పట్టణ పోలీసులు గురువారం దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి నగర పరిధిలో బాప్టిస్ట్‌పేటలో పేకాడుతున్న వారిని ముందుస్తు సమాచారంతో ఎస్.ఐ హరిబాబు తన సిబ్బందితో దాడి చేశారు, వారి నుంచి రూ.28,670 నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డీఏలు విడుదల చేయండి



అమీనాబాద్‌లో ఉపాధ్యాయుల నిరసన

ఫిరంగిపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలు విడుదల చేయాలని కోరుతూ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) ఏపీటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలల్లో గురువారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్, జహంగీర్, టి.భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఇప్పటికే రావాల్సిన అన్ని రకాల బకాయిబిల్లులు చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండు చేశారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని వారికి ఇప్పటికే ఇచ్చిన యాప్‌లను, అసిస్టెంట్ బుక్‌లెట్ విధానాలు రద్దు చేయాలన్నారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయమైన కోర్కెలు తీర్చాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.